# ఎప్పుడూ యింతే

నాకు జయరాంమాట జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, అతని పెళ్లి మాటే ఆలోచనకు వస్తుంది. మేము కాలేజీలోచదువుకునే రోజుల్లో, రాజకీయాలతో పాటు సాంఘిక సమస్యల మీద కూడా విపరీతంగా చర్చించుకునేవాళ్లం. తెలిసీ తెలియని రోజుల్లో ఎవరకి వారే గొప్ప. నిజానికి అజ్ఞానంలోనే విపరీతమైన ఆనందం వుందనుకుంటాను. మగవాళ్లు, పెళ్లిళ్లు, వీటిని గురించి తర్జనభర్జన జరిగేది. మగవాళ్ళు పెళ్లెప్పుడు చేసుకోవాలి అనే ప్రశ్నమీద చాలా చమత్కారంగా వాగ్వివాదము జరుగుతూ వుండేది. మగవాళ్లకు పెళ్లి తొందరేమి టోయ్ అని మా జయరాం చాలా తేలికగా అనేశేవాడు. అప్పట్లో అతనికి వచ్చిన సంబంధాన్ని ఆ సిద్ధాంతంమీద,

ఖాతరు చెయ్య లేదు. తర్వాత తర్వాత అతను అనుకున్నని ఏవీ జరగ లేదు. ఇంకా ఇప్పటికి పెళ్లి కాలేదు. తలోరకంగా తలొకమాట అంటు న్నారుకూడా. అతను తీవ్రంగా బాధపడుతూవుంటాడు. ఏక్షణానో, ఇంకా పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని అతనికి అనిపించి వుంటుంది.

ఇట్లాగే ఆలోచించుకుంటూ కన్నుమూసి నట్టున్నాను. కలకూడా వచ్చేసింది. జయరాం సాక్షాత్తు కనిపించాడు, ఏమిటో మాట్లడుతున్నాడు. అతని పెళ్లి అవుతున్నట్లు, నేనుకూడా అక్కడికి వెళ్ళినట్లు. ఆ ధృశ్యం నా కంటికి కనిపించేటప్పటికి, ఎవరో కొట్టిలేపినట్లు హఠాత్తుగా మెళకువ వచ్చింది. కళ్ళు తెరిచేటప్పటికి జయరాం ఎక్కడున్నాడు! ఏమిటో మనస్సు బాగా ఆరాటపడింది. వెంటనే అతని దగ్గరకు వెళ్ళాలనిపించింది. ఆ ఆలోచనలోనే వుండి పోయాను. ఇవ్వాళ ఎట్లాగైనా వెళ్ళి తీరాలనే గటి పట్టుదలగా వుంది. ఏ బండీకి వెళదామా అని మధనపడుతున్నాను. ఇంతలోకి పోస్టుమన్ కవరు తెచ్చి ఇచ్చాడు. యాంత్రికంగా వాని వైపుకు చూశాను. కళ్ళు చెదిరిపోయినాయి. కనురెప్పలు టపటప కొట్టుకున్నాయి. కళ్లు బాగా విప్పుకునిచూశాను. ఇంతకీ ఏమిటాకవరు! జయరాం పెళ్ళి శుభ లేఖ! నా ఆనందానికి అంతేలేదు. ఆక్షణాన ఏం చెయ్యాడానికి తోచ లేదు. అమాంతం వెళ్ళి జయరాం దగ్గర వాలదామనిపించింది. జయరాం పెళ్ళి జయరాం పెళ్ళి అని గుణించుకుంటున్నాను. ఇంకా ప్రయాణానికి ఆలోచనేముంది!

రైలు దిగంగానే జయరాం అమాంతం వచ్చినన్ను గట్టిగా కౌగ లించుకున్నాడు. కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. మేమిద్దరం ఒకరకొకరు ఎన్నో విషయాలు చెప్పుకోవలసిన వాళ్ళం. ఒకర్నొకరు చూసేటప్పటికి మూగవాళ్ళ మయిపోయినాము. పెళ్ళి సందడిలో అతనితో తీరికగా

మాట్లాడినట్లే అనిపించలేదు. పెళ్లి కూతురివైపుకు చూస్తుంటే, అతను నా వైపుకు చూసి, అదో విధంగా మొహం తిప్పాడు. నా కేమీ అర్థం కాలేదు. అయితే అతని మొహంలో ఏదో అసంతృప్తి వున్నట్లు మాత్రం గ్రహించకలిగాను. ఆ అమ్మాయివైపే ఒకటి రెండు సార్లు చూశాను. నేను అంత సులభంగా అర్థం చేసుకోలేకపోయాను. పెళ్లి పందిట్లోకి నలుగురూ వచ్చారు. జయరాం ఒక్కొక్కర్నే పరిచయం చేస్తున్నాడు. వీరు చంద్ర శేఖరం గారు, ఎం. ఏ. ఫిలాసఫీ ప్యాసయ్యారు. అని ఇంకా పూర్తి చెయ్యకమునుపే, చంద్రశేఖరమా అని మనస్సులో గుణించుకున్నాను. ఎక్కడో బాగాచూసినట్టు గుర్తుగా వుంది.కాని ఫలానా అని పోల్చుకోలేక పోయాను. నేను ఒక్క క్షణం చంద్రశేఖరంవైపు ఆశ్చర్యంగా చూడటం గ్రహించి,మా స్నేహితుడు ఏమిటి నీకుతెలుసా అన్నాడు. చప్పున నాకు జ్ఞాపకం వచ్చింది. చంద్రానివి కాదుటోయ్ నువ్వుఅన్నాను. అతనికి చప్పు న స్ఫురించినట్లుంది. ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు అంటూ దగ్గరకు వచ్చాడు.

నేనూ చంద్రం, మాట్లాడుతున్నంత సేపు,వాల్తేరు ఆంధ్రా యూని వర్సిటీ మాకళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. మాతో చదువుకున్న వాళ్ళల్లో ఎవరు ఎక్కడున్నది,ఏంపనిచేస్తోంది ఏ కరువుపెడుతున్నాడు. ఉండి ఉండి జయప్రద విషయం నీకుతెలుసాఅన్నాడు. నాకు తెలీదని చెప్పటానికికూడా కొంత ఆలోచించాను. ఓహోచాలాపెద్దకథ వుందిలే తర్వాత చెపుతాను అన్నాడు. అయినాయా మీకబుర్లు అంటూ జయరాం మాలోచేరాడు. కాలేజి విషయాలు అంతెక్కడ! ఎంత చెప్పినా తరగవు అన్నాడు చంద్రం. కొంత ఫలహారంచేశాము. మళ్ళీ చంద్రం, నా దగ్గరకే వచ్చేశాడు. కాలేజి విషయాల్లోంచి, ఆంతరంగిక విషయాల్లోకి వచ్చాడు. నా సంగతి అడి గాడు. చెప్పేశాను. నేనుకూడా అతని సంగతి అడగాలని అతనిఉద్దేశం

కాటోలు. పిల్లలకేంలే ముగ్గురు ఆడపిల్లలు,ఒక మగపిల్లవాడు, ఇప్పుడే ఇంటికి వెళ్లినట్టున్నారు అన్నాడు అటూ ఇటూ చూసి.

మనం కూడా కాసేపు ఇంటికివెళ్లొద్దాంరా అన్నాడు. జయరాందగ్గర శలవు తీసుకొని బయలుదేరాం చంద్రంఇంటికి. తనభార్య చదువుకున్నదా అంటే చదువుకున్నదీ అని, అనటానికి వీల్లేదుట. అసలుబొత్తిగా చదువుకోలేదా అంటే ఆమాట అనడానికి వీల్లేదుట, ఇట్లా మధ్యస్తంగావుండటం వల్లనే చాలా చిక్కులు వుంటాయి అయినా నాసరదాకు,నా మనస్తత్వానికి తగిందేమీకాదులే,నీదగ్గర నిజం దాయటం ఎందుకు అంటూ నా మొహంలోకి చూశాడు. నేనుఏమి మాట్లాడలేదు. షళ్లీ నామొహంలోకి అదో రకంగా చూశాడు.

కాలేజీ రోజుల్లో వుండే తీవ్రత, నీకుపెళ్ళయినా తగ్గలేదల్లేవుంది అన్నాను.

నీ చమత్కారపు మాటలు మాత్రం మారినాయా అన్నాడు. మేమిద్దరం చంద్రం ఇంటికి బయలుదేరాము. అతను ఒక్క క్షణం నిలబడిపోయాడు. అతని దృష్టిలో పాటు నాదృష్టి కూడా చప్పున అటువైపు తిరిగింది. బిందె పట్టుకుని ఒకయువతి చరచర, దొడ్డి గుమ్మం వైపుకు నడిచిపోతోంది. బహుశా చంద్రం భార్యేమో అనుకున్నాను. ఇద్దరం వాకిట్లోనే నిలబడివున్నాం. దభాలున తలుపు ఘడియతీసినట్లు చప్పుడు వినిపించింది. తలుపు నెట్టి లోపలకు అడుగుపెట్టాము. ఆమే గబగబ వెళ్ళిపోతోంది లోపలికి. చంద్రం ఒక్క నిమిషం నిబ్బరంగా నావైపుకు చూపి, చప్పున ఓకుర్చీలాగి నాకు చూపించాడు కూర్చోమని.

ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టున్నావు అన్నాను ఏం సమాధానం చెపుతాడో అన్నటుగా.

'ఆః ఏంలేదు...' అంటూ తన మనస్సుపై పైనుంచి లాక్కోడానికి ప్రయత్నం చేశాడు.

ఇంతలోకే ఒకమ్మాయి చెంబులో నీళ్ళు తీసుకువచ్చి, నాముందర పెట్టింది, చప్పున ఆ అమ్మాయివంక చూశాను. క్షణంలో నాకళ్లు నిలిచిపోయాయి. అట్లాగే చూస్తున్నాను. బాగా పరిచయస్థురాలి వాలకం. ఈ అమ్మాయిని ఎక్కడో చూశాను. ఎంత ఆలోచించినా నాకు గుర్తు రావటంలేదు. నాస్మృతులు చకచక గతంలోకి చొచ్చుకుపోతున్నాయి. ఎంతో వెనక్కు వెళ్ళాను. అమరేశ్వరి అని నా నాలికమీదనుంచి ఆ అక్షరాలు దొర్లి క్రిందపడ్డాయి.

నిజంగా అమరేశ్వరే!...ఆ అమ్మాయి ఇంకా ఇట్లాగే వుండి పోయిందా! ఎంతో ఆశ్చర్యం వేసింది. ఆ అమ్మాయి నన్నుచూసి నవ్వింది, నాకూ నవ్వొచ్చింది.

'ఏమిటా నవ్వు...ముందర నమస్కారం చెయ్యి అని గదమాయించాడు చంద్రం'.

ఆ అమ్మాయిని చూస్తున్నంత సేపు నా చిన్నతనంలోని అమరేశ్వరి నా కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. అచ్చగా అమరేశ్వరి లాగానే వుంది.

ఇది మా పెద్దమ్మాయి భువనేశ్వరి అన్నాడు చంద్రం, ఆ అమ్మాయిని చూపిస్తూ నాతో.

ఈ ఏడే కాలేజీలో ప్రవేశపెట్టాను అన్నాడు.

ఆ అమ్మాయి నావంక సగర్వంగా చూసింది.

ఆ చూపుల్లో అమరేశ్వరి కళ్లు సాక్షాత్కరించినాయి. ఇంకొంచెం కళ్ళు విప్పిచూస్తుంటే విశ్వం కనిపించాడు.

చిన్నప్పుడు విశ్వం. అమరేశ్వరీ. నేను కలిసి తిరుగుతూ వుండే వాళ్ళం. ఏమిటే మరీ వాళ్ళతో ఆటలు అంటూ ఆ అమ్మాయి తల్లి కోప పడుతూ వుండేది. ఏమైనాగాని, నేనంటేసరి, ఆ అమ్మాయి ఒక్కక్షణం ఇంట్లో నిలిచేదిగాదు. అట్లతద్దెనాడు. తెల్లవారజామున తోటి ఆడపిల్లలతో ఉయ్యాలలూగవే అని పంపిస్తే. వాళ్ళందర్నీ కాదని మా దగ్గరకువచి గుడివెనకాల మాతో గోలీలు ఆడేది. పరుగుపోటీల్లో మాతో సమానంగా వచ్చేది. చర్ పటే ఆటలో కాపు కాస్తుంటే మా విశ్వం గడిదాటిపోయే వాడు కాదు. మా మగవాళ్ళకంటే మీ ఆడవాళ్ళే బాగా ఆడతారే అని ఎగతాళికి ఎవరైనా అంటే ఆ అమ్మాయికి చెడ్డకోపం వచ్చేది. మగవా ళ్ళేమిటి! ఆడవాళ్ళేమిటి! ఎవరికి ఆటవస్తే. వాళ్ళే ఆడతారు అని మొహం చిట్లించుకునేది.

మేమిద్దరం ఓనాడు గన్నేరు చెట్టుక్రింద కూర్చుని కబుర్లు చెప్పు కుంటున్నాం, ఆ పూలను చప్పరిస్తూ.

ఆ ఊళ్ళో ఎవరినాన్నలు. ఎవరి అమ్మలు మంచివారు. వాళ్లు వాళ్ళవాళ్ళ పిల్లలకు ఏమేమి చెస్తున్నారు అని తర్కించుకుంటున్నాం. ఊళ్ళో వాళ్ళ విషయం మాట్లాడుకున్న తర్వాత, తనవిషయం చెప్పటం మొదలుపెట్టింది. మా నాన్న చాలా మంచివాడు. నేను ఎక్కడికి వెళ్ళినా. ఏంచేసినా, ఏమీ అడగడు. నాకు ఏది కావాలంటే అది కొనిపెడతాడు' మా అమ్మ ఎప్పుడూ నన్ను ఏదో ఒకటి అంటూనే వుంటుంది, నన్ను ఎక్కడికీ వెళ్ళనీదు, ఏమీ ఆడుకోనీదు. ఎప్పుడైనా తనకు బుద్ధిపుడుతే సరోజిని ఇంటికి వెళ్ళి కాసేపు ఆడుకురా అని పంపిస్తుంది. ఆ అమ్మా

యిని చూస్తుంటే నాకు ఒళ్లు మండుకొస్తుంది. ఒక్క ఆట చేతకాదు, గబగబ నడవనుకూడా నడవలేదు. శాంత మరీను, నేను పెళ్ళినప్పటినుంచి ఏమిటో ఏమిటో చెపుతుంది ఆడపిల్లలుట బజార్లవెంబడి తిరిగి గంతులు వెయ్యకూడదని వాళ్ళమ్మ చెప్పిందిట. అదేమొ నాతో చెపుతుంది.ఎందుకు? మా స్నేహితురాళ్ళంతా అంతే! ఎక్కడికి కదిలిరారు. ఎప్పుడూ ఇంట్లోనే వుండిపోవాలంటారు. అసలు ఈ ఆడవాళ్ళంతా అంతే! నాకు వాళ్ళతో ఆడుకో బుద్ధిపుట్టదు.... చెపుతూ చెపుతూ చప్పున ఆపేసి నా కళ్ళలోకి చూసింది.

నువ్వు విశ్వానికి చెప్పకండా ఉంటే నీకోమాట చెపుతాను అన్నది.

నువ్వు చెప్పద్దంటే నేను చెపుతానేమిటి అన్నాను బింకంగా.

'ఆ! ఏంలేదు. విశ్వంతో ఆడుకోవద్దని మా అమ్మ అన్నది. వాడు ఒట్టి పోకిరివాడు అన్నది; పోకిరివాడంటే ఏమిటి...?' నవ్వుతూ నావంక చూసింది.

నాకూ తెలీదు అన్నాను.

'అంతేనా! అయితే మాఅమ్మనే అడుగుతాన్లే అన్నది పెదిమ విరుస్తూ,

నేను ఏమి మాట్లాడలేదు.

అప్పటికి అమరేశ్వరికి పన్నెండేళ్లు వచ్చేసినా యనుకుంటా, ఆ అమ్మాయిని చూస్తుంటే నాకేమిటోగా అనిపించేది. విశ్వం అప్పుడప్పుడు నా చెయ్యిగిల్లి, అమరేశ్వరిని చూపిస్తూ కొంటెగా నవ్వేవాడు, చప్పున అటువైపుకుచూసి తల వంచేసుకునేవాడ్ని, ఆ అమ్మాయికూడా కొంటెగా నవ్వినప్పుడు నవ్వేది. ఒక్కొక్కప్పుడేమొ, ఏమిటా నవ్వటం ఆడితే ఆడండి, లేకపోతే నేను వెళ్ళిపోతానంటూ కోరగా చూసేది.

ఒనాడు సాయంత్రం అయిదు దాటింది. ఆ అమ్మాయి వాళ్ళింటి గుమ్మం ప్రక్కన చాటుగా నిలబడి పొంచి చూస్తున్నాం. విశ్వం, నేనూను. ఆనాడు గుళ్ళోకి వెళ్ళి, మేము ముగ్గురం దేవునిఎదుట కొన్ని ప్రమాణాలు చేద్దామనుకున్నాము. ఎంత సేపటికి అమరేశ్వరి లోపలినుంచి రానేరాదు.

పాపం వాళ్ళమ్మ చివాట్లు పెడుతోంది. ఆ అమ్మాయి వెక్కి వెక్కి ఎడుస్తోంది.

'ఏమిటే నీకెన్నిసార్లు చెప్పినా ఆ మగవాళ్ళతో ఆటలేమిటంట ! ఇరుగు పొరుగున ఎంతమంది ఆడపిల్లలు లేరు. వాళ్ళెన్నడైనా మగ పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా నువ్వు చూశావా అంట ! నీకేవిధంగా చెపుతే అర్ధమవుతుందో నాకు తెలీకుండా వుంది. అద్దం ముందర నుంచుని నీ రూపు చూసుకో నీకే తెలుస్తుంది...ఇంకా ఇంకా ఏమేమొ అంటోంది.

నేనేం చేశానేమిటి ! నన్ను ఊరికే తిట్టి పోస్తావు. నాన్న రానీ చెపుతాను. అంటూ అమరేశ్వరి కంట తడిపెడుతూనే వున్నది.

'నాన్నగారొస్తే, నన్ను చంపిపారవేస్తారా ! రానీ వారిదగ్గరే తేల్చుకుంటాను. అని హుంకరిస్తోంది తల్లి.

అమ్మా అంటూ బావురుమంది అమరేశ్వరి.

పిచ్చిపిల్లా! నీకు తెలీదమ్మ ! ఇన్నాళ్ళ తీరే వేరు. ఇకనుంచైనా నామాటలు విని నువ్వు మగవాళ్ళతో ఆటలు మానేసెయ్యి. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో తెలుసా ! ఒట్టి గడుగ్గాయిపిల్ల అంటారు... అని బ్రతిమాలుతోంది.

ఆ సాయంత్రం అమరేశ్వరి రానూలేదు, మేము ప్రమాణాలు చెయ్యనూలేదు. మర్నాడు ఇంటిగుమ్మం కదిలినట్లు లేదు, ఇంట్లోనే వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుందిట.

నా ఎదుట కూర్చుని ఏడుస్తుంటే ఏం ప్రయోజనం కాని, నీ ఇష్టము వచ్చినట్లే చెయ్యమ్మ అని వాళ్ళతల్లి అన్నం పెట్టి పంపించిందిట.

మా ఇద్దరి ఎదుట కూర్చుని, మోకాళ్ళమీద తల ఆనిచ్చి కళ్లు పైకెత్తి, కనుపాపలు తిప్పుతూ నావంక చూసి ఓ ప్రశ్న అడగనా అన్నది అమరేశ్వరి.

అడుగు అన్నాను.

సమాధానం చెపుతారా మరి ! అన్నది ఆలోచనగా ఆగి.

తలలూపాము.

గడుగ్గాయంటే ఏమిటని అడిగింది.

మేమిద్దరం కరిమొహం ఒకరు చూసుకుని బుజాలు ఎగరేశాం.

గడుగ్గాయంటే ఏముంది : ఒట్టి అల్లరి కోరన్నమాట.

'కాదు...'

కాకపోతే మరేమిటో నువ్వుచెప్పు.

ఏమో నాకసలు తెలీదు. మీరే చెప్పాలి. నాకు తెలుస్తే మిమ్మల్ని అడుగుతానేమిటి : అన్నది నవ్వుతూ.

మేము ఇంతకంటె చెప్పలేమని ఒప్పుకున్నాం.

మా అమ్మ నన్ను గడుగ్గాయి అన్నది అంటూ నవ్వింది. గిర్రున తిరిగి వెళ్ళిపోయింది.

నేనూ, విశ్వం చాలా సేపటిదాక కూర్చొని. అమరేశ్వరిని గురించి. ఇంకా ఇతర ఆడపిల్లలగురించి బాగా చర్చించుకుని. ఒకరి అజ్ఞానానికి ఒకరు సంతృప్తి పడ్డాము.

ఓనాడు గుళ్ళో విశ్వం, నేనూ కూర్చునివున్నాం. వెనకాలే అమరేశ్వరి వచ్చి, మా ఇద్దర్ని అమాంతం ఉలిక్కిపడేటట్లుచేసింది, వెనక్కు తిరిగి చూశాను. నాకళ్ళు అట్లాగే నిలిచిపోయినాయి. విశ్వం ఆశ్చర్యంగా చూశాడు, ఈసారి అమరేశ్వరికి నిజంగా సిగ్గువేసినట్లుంది. తలవంచుకుని చేతులు రెండూ కట్టుకుని మెదలకండా వెళ్ళిపోయింది. నిజంగా అమరేశ్వరిలో మార్పు వచ్చింది. పెద్దదవుతోంది అనుకున్నాం. మా ఒళ్లు ఝల్లుమన్నది. ఎవరిదోవన వారు ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయినాము.

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలకు షుమారు నేను, బజారు నుంచి తిరిగివస్తుంటే వాళ్ళ గుమ్మంలో నిలబడి, నావైపుకు చూస్తూ, ఇప్పుడు నవ్వు నన్నుచూసి అన్నది అమరేశ్వరి.

నేను నిశ్చేష్టుణయి పోయాను. అట్లాగే ఆ అమ్మాయివంక చూస్తూ నిలబడ్డాను, నీలంరంగు పరికిణీ కట్టుకుంది. పసుపు పచ్చ జాకెట్టు తొడుక్కుంది, తెల్లటి మల్లు పమిట వేసుకుంది. అమరేశ్వరి ఒక్క రోజులో ఎంతో పెరిగినట్లనిపించింది. ఆ అమ్మాయివైపుకు చూడటానికి భయపడ్డాను. చరచర విశ్వం ఇంటికి వెళ్లాను.

ఒరేయ్ విశ్వం. అమరేశ్వరి పెద్దదయిపోయింది. చాలా పెద్దదయిపోయింది. మనం గుర్తు పట్టేటట్టులేదు. ఒక్కరోజులో పెద్దదయిపోయిందిరా అంటూ ఆశ్చర్యంగా అతనివైపుకు చూశాను.

ఏమిటోయ్ నువ్వనేది నా కేమీ అర్థం కావటం లేదన్నాడు. నీ కళ్ళతో చూస్తే, నీకే అర్థమవుతుంది అన్నాను.

ఆ సాయంత్రం మాకంటే ముందుగానే గుడిమండపం మీద కూర్చునివుంది. మమ్మల్ని కొంచెం దూరంనుంచే చూసి నవ్వటం మొదలు పెట్టింది.

ఇవ్వాళ్టి నుంచి మిమ్మల్ని చూసి నవ్వుతా నేను. అంటూ పకపక నవ్వటం మొదలుపెట్టింది.

విశ్వం బిత్తరుపోయాడు.

ఏం ! నేను ఇవ్వాళ కొత్తగా వున్నాను కాదూ. అంటోంది పమిట సవరించుకుంటూ.

నాలో నాకు ఆలోచనలు వస్తున్నాయి. ఆదివరకు మాదిరిగా అమరేశ్వరితో కబుర్లు చెప్పటానికి వీలుండదు. అంత సేపు మనదగ్గర కూర్చోనూ కూర్చోదు. ఆ అమ్మాయికూర్చున్నా మనం కూర్చోకూడదు. నేను మగవాణ్ని, ఆ అమ్మాయి ఆడది. నాలో ఏమిటో గుణించుకుంటున్నాను.

క్రో క్రొమ్మచ్చులు ఆడటం మానేశాం, చర్‌పట్టీ చెరిగిపోయింది. గోళీలు పగలిపోయినాయి. ఇప్పుడు ఆ అమ్మాయితో మాట్లాడాలంటే మాటలు తడుముకోవాలసి వస్తోంది. ఏం మాట్లాడాలో అర్థం కావటం లేదు. ఒళ్లు జలతరిస్తోంది, నిట్టనిలువుగా ఆ అమ్మాయిని చూడాలంటే ఎంతో బెరుకుగా వుంది. అసలు ఆ అమ్మాయి రావటం కూడా క్రమ క్రమంగా తగ్గిపోయింది. ఈ మధ్యలో మేము కలిసికూడా చాలా రోజులయానట్లనిపించింది.

ఆనాడు గుడి ధ్వజస్థంభం దిమ్మెమీద కూర్చుని ఆకాశదీపం చూస్తున్నాను. గాలికి ఆకాశదీపం అటూ ఇటూ కదులుతోంది. పైకిఅంత ఎత్తు చూస్తుండేటప్పటికి భూమంతా కదిలిపోతున్నట్లనిపించింది—కళ్ళు తిరిగినట్లయినాయి. చప్పున కళ్ళు తుడుచుకుని విశ్వం వైపుకు తిరిగాను. విశ్వం! అని రెండుసార్లు పిలిచాను. ఏమీ మాట్లాడలేదు అతడు.

ఏమిటి అట్లా వున్నావు! అన్నాను.

మా అమ్మ, ఇవ్వాళ అమరేశ్వరి ఇంటికి పేరంటానికి వెళ్ళింది అన్నాడు ముక్తసరిగా.

అవును మా అమ్మా వెళ్ళింది అన్నాను.

అమరేశ్వరి ఈ మధ్య కనిపించటం మానేసింది. ఊళ్ళో వుందా! ఏ ఊరైనా వెళ్ళిందా అన్నాడు.

ఊళ్ళోనే ఉన్నట్టు విన్నాను అన్నాను.

ఓహో విన్నావేం! అంటూ నవ్వుతూ లేచాడు, ఇంటికి వెళ్లదాంలే అంటూ.

మా మనస్సుల్లో మేము అమరేశ్వరి గురించి ఆలోచించుకుంటూ తలోకదోవన వెళ్లిపోయాము.

ఓ శనివారం. అమరేశ్వరి గుళ్ళోకి వస్తుందని తెలిసి. మేము ముందుగానే అక్కడికి వెళ్ళాము. మా ఇద్దర్ని చూసి నిశ్చేష్టురాలయి పోయింది. చప్పున రెండు చేతుల్తో కళ్ళు మూసుకుంది. మమ్మల్ని చూడటానికి చెడ్డ సిగ్గు పడ్డట్లనిపించింది. ఆ అమ్మాయిని చూస్తుంటే, నా ఊహలు, నా ఆలోచనలు తమాషాగా మెలికలు తిరగటం, మొదలుపెట్టి నాయి.

మొదటినుంచి ఆడపిల్లలతో చనువుగా తిరగటం అలవాటుపడక పోవటం, ఇప్పుడేమొ మాదగ్గరకువచ్చి బాహాటంగా కబుర్లు చెప్పటానికేమొ వత్తిళ్ళ ఎక్కువై పోవటం, ఈ ఇరకాటంలోపడి, చాలా బాధ పడుతున్నట్లు ఆ అమ్మాయిని చూస్తుంటేనే తెలుస్తోంది.

ఓ నాడు విర్భయంగా గబగబ వచ్చేసి మాదగ్గర కూర్చుంది. కళ్ళు మాటిమాటికి తుడుచుకుంటోంది. కళ్ల చూడబోతే బాగా ఎర్ర బడ్డాయి. మొహం కందిపోయింది. కొంచెంగా ఆయాసపడుతోంది.

నాకేమీ అర్థంకాలేదు. ఇంత ఇదిగా ఎందుకు వుందా అనే ఆలోచనలో పడ్డాను.

'నిన్ను వదిలిపెట్టి వుండలేను' అంటూ బావురుమని ఏడ్చింది.

నాకేం తోచలేదు. ఎట్లా ఓదార్చాలో అర్థం కావటంలేదు. ఆడపిల్ల వయస్సులో వున్నది. ఇలాంటి అనుభవం ఇది మొదటిసారి.

'అమరేశ్వరీ! ఏమిటి?' అన్నాను చింతగా.

నా రెండు చేతులు పట్టుకుంది.

'మేము ఈ ఊరునుంచి వెళ్ళిపోతున్నాం. ఇక్కడ మానాన్న ఉద్యోగం అయిపోయింది...' తడబడుతూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

నాకు గుండె ఆగినంతపనయింది. నువ్వు ఈ ఊరునుంచి వెళ్ళి పోతున్నావా! అంటూ ఆశ్చర్యంగా మనస్సులోనే అనుకున్నాను.

అమరేశ్వరి. రెండు చేతుల్తో మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ, గబగబ వెళ్ళిపోయింది. ఎంత పిలిచినా పలకలేదు.

సాయంత్రం షుమారు ఆరుగంటలకు రెండుబళ్ళు వచ్చి నిల బడ్డాయి. సామాను ఒకబండిలో ఎక్కిస్తున్నారు. రెండో బండిలో అమ రేశ్వరి తల్లిదండ్రులు కూర్చున్నారు. ఆ అమ్మాయి ఏడుస్తూనే వుంది. బళ్లు రైలుస్టేషను చేరాయి. ప్లాటుఫారం మీదకి వచ్చి తత్తరపాటుగా అటూ ఇటూ కలయచూస్తోంది అమరేశ్వరి. నేను ఆ అమ్మాయి దృష్టికి తగలలేదు. అట్లాగే నిలబడి వుంది. రైలు వచ్చేసింది.

కొంచెం దగ్గరగా వెళ్ళి 'అమరేశ్వరీ' అన్నాను. చప్పున నామాట విని అప్రయత్నంగా వెనక్కు తిరిగింది. కళ్లు పెద్దవి చేసుకుని నావైపుకు చూసింది. పాపం దుఃఖమాగలేదు. విశ్వానికి, నాకు కళ్ళు తడిసినాయి. మేము ఏమీ మాట్లాడలేదు. ఆ మూగవాణిలోనే ఒకర్నొకరు అర్థం చేసుకున్నాం. అమరేశ్వరి రైలెక్కింది. రైలు కదిలింది. నా ఒళ్లు వణికింది. గుండె దడదడా కొట్టుకుపోతోంది. రైలు మా యిద్దరి మధ్య వున్న దూరాన్ని చూస్తూ చూస్తుండగానే పెంచుకుంటూ పోతోంది.

అదే చివరిసారి నేను అమరేశ్వరిని చూడటం. తర్వాత చాలా రోజులదాకా కళ్ళలోకి వచ్చికూర్చుని ఏదో పలకరిస్తూవుండేది. కాల ప్రవాహంలో ఆ స్మృతులు పల్చనయి పోయినాయి.

మళ్ళీ ఇవ్వాళ ఆ అమరేశ్వరి రూపాన్ని చూడకలిగాను. చప్పున మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చిపడ్డాను.

చంద్రం. భువనేశ్వరిని గురించి చెప్తున్నాడు. ఇంతలోకీ ''వనా'' అంటూ, వాకిట్లోంచి ఓ శబ్దం వినిపించింది. చప్పున వెనక్కు తిరిగాను. ఇరవైయేళ్ళ కుర్రాడు నైలాన్ బుష్షర్టులో ఊగిసలాడిపోతున్నాడు.

'ఆ!' అంటూ భువనేశ్వరి ఒక్క గంతువేసింది.

'అమ్మాయి !' అంటూ లోపల్నించి శబ్దం వినిపించింది.

భువనేశ్వరి క్షణంలో ఆగిపోయింది. ఇంట్లోకి వెళ్ళింది. తల్లీ కూతురికి మధ్య ఘర్షణ జరుగుతోంది.

ఒకటి రెండు నిమిషాలు ఆగి చంద్రం విసురుగా లోపలికివెళ్ళాడు.

'ఏమిటాగోల ! పోపీరాదూ... ఆడపిల్లలైతే ఏమిటి ! నీమాదిరిగా నాలుగు గోడలమధ్య,వంటింట్లో మగ్గిపోవాల్సిందే నంటావా! ఇట్లావ త్తిళ్ల పెడుతూ వుంటేనే ఎప్పుడో ఓనాడు మన నెత్తిన వచ్చిపడుతుంది." చర చర భువనేశ్వరి చెయ్యిపట్టుకుని తీసుకువచ్చాడు చంద్రం.

నాకు గతస్మృతులు కళ్ళల్లోకి వచ్చినాయి. ఇక్కడ భువనేశ్వరిని చూస్తున్నాను. నాకు గట్టి నమ్మకం ఏర్పడింది. ఆ ఆలోచన నా మెదడు లోకి రాగానే ఒళ్లు ఝల్లు మంటోంది. తీవ్రంగా మధనపడిపోతున్నాను.

చంద్రం లోపలికి వెళ్ళి ఫలహారం తీసుకువచ్చాడు.

ఇప్పుడేకాదుటోయ్ మనం తీసుకున్నది, అన్నాకూడా పట్టుపట్టాడు. 'ఏమిటా ఆలస్యం ! కాఫీ తీసుకురా, అంటూ పెద్దకేకపెట్టాడు చంద్రం. పాపం ఆమెగారు ఇక్కడికి రావటానికి నే నున్నానని సందేహిస్తోంది గామాలు, చంద్రానికి నదురూ బెదురూ లేదు,

ఏం ఫరవాలేదులే, మా చిన్న నాటి స్నేహితుడే. తీసుకురా ! అన్నాడు.

పాపం ఆమె కాఫీ పట్టుకొస్తోంది. తలపూర్తిగా వంచేసుకునే వుంది. చంద్ర ఏదో అనటంతో దభాలున తలెత్తింది.

నా కళ్ళు నిలిచిపోయినాయి.

నా చిన్ననాటి అమరేశ్వరి!

ఆమె ఒళ్ళు కదిలిపోతోంది. రెండు క్షణాలు నిబ్బరంగా మౌనంగా వుండిపోయాము.

చంద్రం మా ఇద్దరివైపుకు బిత్తరు చూపులు చూస్తున్నాడు.

అమరేశ్వరి రెండు కప్పులు అక్కడ పెట్టి, ఎంతో భయంగా, ఆవేదనగా లోపలికి వెళ్ళిపోయింది. అంతా చూస్తున్న చంద్రం నాతో ఏమీ అనలేకపోయాడు.

యాంత్రికంగా లేచాను. వెళ్ళొస్తాను అంటూ రెండు మూడుసార్లు తడబడ్డాను. నా మనస్సు నా స్వాధీనం చేసుకుందామని ఎంతో ప్రయత్నం చేసాను. ఆ కారణంగా చంద్రం కలవరపడుతున్నట్లున్నాడు. నేను వెళ్ళు తున్నానని చెప్పినాకూడా చంద్రం కుర్చీలోంచి లేవలేదు. ఎట్లాగైనా సరే మళ్ళీ ఒకసారి అమరేశ్వరిని చూడాలని గట్టి పట్టుదలగా వుంది. కాని చంద్రం మొహం చూస్తుంటే నాకు భయంగావుంది. అతడు అనవసరంగా అనుమానపడుతున్నాట్లున్నాడు. కాని నే నేమీ చెయ్యలేను.

అయితే ఒక్కటి మాత్రం నేను చెయ్యగలిగింది వుంది. మళ్ళీ అమరేశ్వరిని చూడాలనే కోరిక చంపుకోవటం, చంద్రం కోసం ఆకోరిక మాత్రం అణచుకున్నాను. అంతే!

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)

---